క్లుప్తంగా

ఎంబీఏ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య ఎంబీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. డిసెంబరులో జరిగిన ఎంబీఏ సెమిస్టర్, నాన్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

ఆలయానికి వెండి బహూకరణ



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు అన్నానగర్ చౌరస్తాలోని పంచముఖ హనుమాన్ ఆలయానికి రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్నే క్రిశాంక్ కిలో వెండిని బహూకరించారు. ఇటీవల ఆలయంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీరామ పాదుకలు, హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆలయానికి వెండిని బహూకరించనున్నట్లు ఇచ్చిన హామీ మేరకు శనివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దేల యాదగిరి, మురళి, చిన్నం పాండు, మోని, రఘుబాబు, రాజ్ పాల్గొన్నారు.

పోటీకి అవకాశం ఇవ్వండి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో ఐదో వార్డు నుంచి పోటీ చేసేందుకు తన సతీమణి సుహాసినికి అవకాశం కల్పించాలని ఐదో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కిరణ్ కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సారి ఎన్నికల్లో ఉద్యమకారుడిగా తనకు అవకాశం కల్పించాల్సిందిగా కోరామన్నారు. మంత్రిని కలిసిన వారిలో నాగేంద్ర యాదవ్, సుబ్రహ్మణ్యం, రాహుల్, అశోక్, రాజు ఉన్నారు.

కంటోన్మెంట్: దున్నపోతు ఈనిందంటే దూడను దొడ్లో కట్టేయమన్నట్టు ఉంది కంటోన్మెంట్ అధికారుల వ్యవహారం. బోర్డు ఎన్నికల ప్రక్రియలో భాగంగా నూతన ఓటర్ల నమోదులో బోర్డు సిబ్బంది అచ్చం ఇలాగే వ్యవహరించారు. నూతన ఓటరు నమోదు కోసం ఇబ్బడి ముబ్బడిగా వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆమోదించారు. కంటోన్మెంట్ నిబంధనల మేరకు 'స్థానిక నివాసితులు' బోర్డు ఎన్నికల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అర్హులు. అయితే ఈ మేరకు స్థానికతను ధ్రువీకరించే పత్రాలను పరిశీలించకుండానే బోర్డు సిబ్బంది నూతన దరఖాస్తులన్నింటినీ ఆమోదించారు. దీంతో కొత్తగా ఓటరు నమోదు కోసం 17 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. వీటిలో మెజారిటీ ఓటర్లు స్థానికేతరులే అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన సిబ్బందికి సైతం విస్తుపోతున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో నమోదైన బోగస్ ఓట్లను ఆమోదించొద్దంటూ పలువురు బోర్డు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కిందిస్థాయి సిబ్బంది నిర్వాకంతో బోర్డు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పరిమిత సమయంలో 17 వేలకు పైగా దరఖాస్తులను ఎలా పరిశీలించాలో అని తర్జనభర్జన పడుతున్నారు.

స్థానికేతరులకు ఓటు | అధికారులకు తల పోటు

17,604 ఓట్లలో బోగస్‌లే ఎక్కువంటూ ఫిర్యాదులు

- బోర్డు సిబ్బంది నిర్వాకంతో గందరగోళం
- తగిన ధ్రువీకరణ పత్రాలు లేకుండా దరఖాస్తు చేసినట్లు ఆరోపణలు
- దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన అధికారులు



సీఈఓ మధుకర్ నాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న బోర్డు మాజీ సభ్యుడు విఠల్ రెడ్డి(ఫైల్)

నాన్ రెసిడెంట్లే ఎక్కువ..

కంటోన్మెంట్ నిబంధనల ప్రకారం స్థానికులకు మాత్రమే కంటోన్మెంట్ బోర్డు ఓటరు జాబితాలో స్థానం కల్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు 'ది కంటోన్మెంట్ ఎలక్టోరల్ రూల్స్–2007'లో ప్రత్యేకంగా ప్రస్తావనేమీ లేదు. అయితే కంటోన్మెంట్ పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమిత నివాసాల్లోని వారి ఓట్లు తొలగించే క్రమంలో సుప్రీం కోర్టు కీలక



తీర్పు వెలువరించింది. సుప్రీం తీర్పు ప్రకారం కంటోన్మెంట్ 'రెసిడెంట్లు' మాత్రమే ఓటరు జాబితాలో చేరేందుకు అర్హులు. ఇదే ప్రామాణికంగా తీసుకుని 2018 నుంచి నేటికీ సుమారు లక్ష మంది స్థానికుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారు. ఎలక్షన్ కమిషన్ జాబితా పేర్లు ఉన్న లక్ష మందికి బోర్డు జాబితాలో ఓట్లు లేకపోవడమే ఇందుకు నిదర్శనం.

ఫోర్జరీ చేసి..

ఇదిలా ఉండగా ఓట్ల తొలగింపు కోసం సుప్రీం తీర్పు, స్థానికతను బోర్డు అధికారులు ఆధారం చేసుకున్నారు. కొత్త ఓటర్ల నమోదు విషయంలో మాత్రం ఈ నిబంధనను అమలు చేయడంలో విఫలం అయ్యారు. తద్వారా తాజా ఓటరు జాబితా సవరణ (కొత్త ఓటర్ల నమోదు)లో 17,604 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 755 ఆర్మీ సిబ్బంది ఉన్నారు. నూతన ఓటరు దరఖాస్తులకు సంబంధించి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో కొందరు దళారులు తమ ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారు. ఒక్కో ఇంటిపై పదుల సంఖ్యలో నూతన ఓట్లను నమోదు చేయించారు. దరఖాస్తుదారు, ప్రతిపాదిత పేర్లు, సంతకాలూ ఫోర్జరీ చేసిన ఉదంతాలూ వెలుగులోకి వచ్చాయి. ఇక కీలకమైన స్థానికత ధ్రువీకరణ విషయంలో మెజారిటీ దరఖాస్తుదారులు తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదు.

ఈ నెల 14 నుంచి విచారణ..

కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా పెద్ద సంఖ్యలో బోగస్ ఓట్లు నమోదు కావడంతో బోర్డు అధికారులు దిద్దుబాటు చర్యలపై దృష్టి సారించారు. ఇప్పటికే వెబ్‌సైట్‌లో ప్రకటించిన నూతన ఓటరు జాబితా (17,604)పై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. అయితే సంబంధిత ఓటరు జాబితా పూర్తిగా లోపభూయిష్టంగా ఉందంటూ పలువురు ఫిర్యాదు చేశారు. తాజాగా బోర్డు మాజీ సభ్యుడు, అడ్వొకేట్ విఠల్‌రెడ్డి, సీఈఓకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ నేపథ్యంలో నూతన ఓటరు దరఖాస్తు దారులందరికీ నోటీసులు పంపాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 14 నుంచి 16 వరకు చేపట్టనున్న విచారణ సందర్భంగా స్థానికత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని కోరనున్నారు. తగిన పత్రాలు అందజేసిన వారిని మాత్రమే ఓటర్లుగా గుర్తించి, మిగతా వారి దరఖాస్తులు తిరస్కరించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్న సీఎం

మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: మహిళా దినోత్సవం కానుకగా సీఎం కేసీఆర్ మహిళలకు వడ్డీలేని రుణాలను ప్రకటించారని త్వరలో వాటిని అందజేస్తారని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బోర్డు మాజీ సభ్యులు అనితాప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం భాంటీయా గార్డెన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదితో కలిసి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం షాదీముబారక్, కల్యాణలక్ష్మి, ఒంటరి మహిళా, ఆసరా తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోందన్నారు. నివేదిత మాట్లాడుతూ.. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ కంటోన్మెంట్ నియోజకవర్గంలో పేద ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్, పాండుయాదవ్, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్, సాధన, దివ్య, భవ్య, ఆర్పీలు రేఖ, శైలజ, శ్యామల, శ్రీజ, సృజన, ఫర్హిన్, సునీత, ఉమ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

స్వచ్ఛంద సంస్థలు సేవలను మరింత విస్తరించాలి



రాంగోపాల్‌పేట్: పేదలు, అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు వాటి సేవలను మరింత విస్తరించాలని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. శనివారం జేసీఐ సికింద్రాబాద్ డఫోడిల్స్ ఆధ్వర్యంలో గైదీస్‌బాగ్‌లో బస్తీ ప్రజలకు వాటర్ కూలర్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని ఇందులో జేసీఐ పాత్ర అమోఘమని కొనియాడారు. స్వచ్ఛంద సంస్థలు, మానవతా వాదులు సమాజంలో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు జతేందర్ మాన్, విధి గుప్తా, రుబినా మదాని, సందీప్ సర్ధా, ఆన్ జాన్ ఎడ్విన్, సత్య ప్రసన్న, బినిత మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి ప్రత్యేక ప్రాధాన్యం



మహిళల ఉత్పత్తుల ప్రదర్శనను సందర్శించిన జెడ్సీ శ్రీనివాస్‌రెడ్డి

సికింద్రాబాద్: మహిళలను పొదుపు సంఘాల్లో చేర్పించి ఉపాధి అవకాశాలు చూపించడం కోసం అర్బన్ కమ్యూనిటీ విభాగం పరంగా ప్రత్యేక చర్యలతో సత్ఫలితాలు రాబడుతున్నామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా శనివారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ టి.దశరథ్ నేతృత్వంలో పొదుపు సంఘాల మహిళలు, స్వచ్ఛంద సంస్థల మహిళా ప్రతినిధులు, జుడిషియరీ విభాగానికి చెందిన మహిళల వర్క్‌షాప్ జరిగింది. ఈ మహిళల అభ్యున్నతి కోసం జీహెచ్ఎంసీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలు, మహిళల ప్రగతి కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. లాలాగూడ ఇన్‌స్పెక్టర్ మధులత, స్పార్క్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శివకుమారి, న్యాయవాది మహేశ్వరి మాట్లాడుతూ.. మహిళలు ఆదాయ మార్గాలు ఎంచుకోవడం, సమాజంలోని సమస్యలను అధిగమించే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు టీ.దశరథ్, ముకుందరెడ్డి, అర్బన్ కమ్యూనిటీ అభివృద్ధి విభాగం అధికారి టీ.శ్రీనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మహిళల పాత్ర అత్యంత కీలకం

పంజగుట్ట సబ్ ఇన్‌స్పెక్టర్ భావన



కార్యక్రమానికి హాజరైన అధికారులు, మహిళా ప్రతినిధులు

అమీర్‌పేట: మహిళల రక్షణ విషయంలో పోలీసుల శాఖ నిరంతరం పని చేస్తోందని పంజగుట్ట సబ్ ఇన్‌స్పెక్టర్ భావన అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అమీర్‌పేట మున్సిపల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మహిళల సాధికారత, రక్షణ, హక్కులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలు, పిల్లల భద్రత విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేధింపుల నుండి మహిళలకు విముక్తి కల్పించేందుకు పోలీసుల శాఖ ఏర్పాటు చేసిన షీటీమ్స్ పనితీరు గురించి ఎస్సై భావన వివరించారు. రచయిత్రి లావణ్య మాట్లాడుతూ.. రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు, చట్టాల ద్వారా అమలవుతున్న రక్షణ పరమైన అంశాల పట్ల అవగాహన కల్పించారు. రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ మహిళ సాధికారతపై మాట్లాడారు. పిల్లల్ని ప్రయోజకులను చేయడంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ మోహన్ రెడ్డి, యుసీడి ప్రాజెక్ట్ అధికారి దామోదర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు కార్యాలయంలో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహిళ సాధికారిత అంశంపై 2021 మిస్ వరల్డ్ ఏసియా విన్నర్ మానస వారణాసి హాజరై మహిళలు సాధికారిత ఎలా సాధించాలనే దానిపై ప్రసంగించారు. అనంతరం పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఆమెను సత్కరించారు.



పోలీసు కస్టడీకి సిగ్నల్ బ్యాటరీల దొంగలు

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్ సిగ్నళ్లకు ఉండే బ్యాటరీలను దొంగతనం చేస్తూ చిక్కిన ఇద్దరిని గోపాలపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శాస్త్రీపురంకు చెందిన షేక్ అజ్ముద్దీన్ (65), మహబూబ్‌నగర్ ఉండవల్లికి చెందిన జంగుల మద్దిలేటి (48) స్నేహితులు. ఇద్దరు కలిసి ట్రాఫిక్ సిగ్నళ్ల లైట్లకు అమర్చిన బ్యాటరీలను దొంగిలిస్తున్నారు. గత నెల 19న వీరిద్దరిని అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జనవరి 12న వైఎంసీఏ వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీలను సైతం దొంగిలించి ఆటోలో ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అబిడ్స్ పోలీసులు నిందితులను అరెస్టు చేయడంతో గోపాలపురం కేసులో కూడా విచారణ చేపట్టాల్సి ఉండటంతో శనివారం వారిని కస్టడీకి తీసుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో భారీగా బంగారం పట్టివేత

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో డీఆర్ఐ అధికారులు భారీమొత్తంలో బంగారాన్ని పట్టుకున్నారు. కోల్‌కత్తా నుంచి ఫలక్‌నుమా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ వ్యక్తి వద్ద 2.314 కిలోల బంగారం కడ్డీలు ఉన్నట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారు విలువ 1.32 కోట్లు ఉంటుందని పట్టుబడ్డ వ్యక్తి కోల్‌కత్తా నుంచి స్మగ్లింగ్ బంగారాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

పరిశోధనలో సైన్స్ కమ్యూనికేషన్ ప్రధానం

లాలాపేట: సీఎస్ఐఆర్–ఐఐసీటీలో కొనసాగుతున్న వన్ వీక్ వన్ ల్యాబ్ ప్రచార కార్యక్రమంలో శనివారం సైన్స్ కమ్యూనికేషన్ అండ్ ఎథిక్స్ ఇన్ సైన్స్ అనే అంశంపై ఔట్‌రీచ్ కార్యక్రమం జరిగింది. అకాడమీ ఆఫ్ సైన్స్ సైంటిఫిక్, ఇన్నోవేటివ్ రీసెర్చ్ (ఏసీఎస్ఐఆర్) డైరెక్టర్ డాక్టర్ మనోజ్‌ధర్ ముఖ్య అతిథిగా హాజరై 5వ రోజు సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. పరిశోధనల్లో సైన్స్ కమ్యూనికేషన్ ఎంతో ప్రధానమైందన్నారు. నాణ్యమైన పరిశోధనలు చేయాలంటే అందుకు సరైన సమాచారం (డేటా)తో పాటు అంకితభావంతో పనిచేస్తే అప్పుడే ఆ పరిశోధనలు దేశాభివృద్ధికి దోహదపడుతాయని అభిప్రాయపడ్డారు. సైన్స్ ఫొటో జర్నలిస్టు పల్లవ బగ్లా మాట్లాడుతూ.. భారతదేశంలో కొనసాగుతున్న సైన్స్ పరిశోధనలు వాటి ఫలాలు ప్రజలకు చేరాలంటే శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను సరళమైన ఆయా భాషల్లో అనువాదించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐసిడి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించిందని బాలికపై అత్యాచారం

వ్యక్తిపై కేసు నమోదు

అమీర్‌పేట: పెళ్లికి నిరాకరించిన ఓ బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం..ఎస్ఆర్‌నగర్ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈ నెల 1వ తేదీన తల్లితో కలిసి కల్యాణ్‌నగర్‌లో ఉండే బంధువుల ఇంటికెళ్లింది. 27 ఏళ్ల సతీష్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని బంధువులు సూచించగా అందుకు బాలిక నిరాకరించింది. దీంతో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి తీసుకువెళ్లి బలవంతంగా అత్యాచారం చేశాడు. విషయాన్ని ఎవరికైన చెబితే చంపుతానని బెదిరించాడు. ఆ తర్వాత పలుమార్లు ఆమెపై అత్యాచారం చేశాడు. మూసాపేట ప్రాంతంలో ఉండే అమ్మమ్మ అనారోగ్యం బారిన పడడంతో చూసేందుకు వచ్చిన బాలిక ముభావంగా కనిపించడంతో అమ్మమ్మ ఆరా తీయగా జరిగిన విషయాన్ని చెప్పడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెళ్లి చేసుకుంటానని యువతిపై..

అమీర్‌పేట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేసిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌కు చెందిన మహ్మద్ హనీఫ్ (45), ఇంటర్ చదువుతున్న 19 ఏళ్ల యువతికి గతేడాదిలో పరిచయమయ్యాడు. అప్పటికే పెళ్లయిన హనీఫ్ నిన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. యూసుఫ్‌గూడలోని ఓ లాడ్జికి తీసుకువెళ్లి పలుసార్లు అత్యాచారం చేశాడు. కొన్ని రోజుల తర్వాత తనకు డబ్బు అవసరముందని ఇవ్వకుంటే విషయాన్ని బయట పెడతానని యువతిని వేధించడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

లాలాపేట/అమీర్‌పేట: భారత జాగృతి జాతీయ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సంజయ్ మహిళల పట్ల అమర్యాదగా మాట్లాడటం పద్ధతి కాదన్నారు. కవితపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజశేఖర్, యోబు, రాజు, దాస్, గాజుల నాగరాజు, కర్నె భాస్కర్ పాల్గొన్నారు.

అరెస్టు చేయాలి..

లాలాపేట: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ బండి సంజయ్ మాటలు మహిళా లోకాన్ని కించపరిచేలా ఉన్నాయని వెంటనే అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు సామల హేమ, సునీత, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

భౌతిక దాడులకు వెనుకాడం..

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవితపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో భౌతిక దాడులకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.